ప్రచురణార్థం: ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో అంశాలను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**దళితులపై జరుగుతున్న దాడులను**
**కప్పిపుచ్చుతున్న అధికార పక్షం**
**నిరూపించేందుకు సిద్ధం**
**వీటిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణయ్య, సుబ్బారావు**

రాష్ట్రంలో దళితులపై వివిధ రూపాల్లో దాడులు తీవ్రంగా జరుగుతున్నాయని, వీటిని అధికార పార్టీ కప్పిపుచ్చుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి కృష్ణయ్య, దడాల సుబ్బారావు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్రకార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముందుగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రులో సామాజిక బహిష్కరణ ఇంకా కొనసాగుతుందని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ శాఖల మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు గరగపర్రులో పర్యటించి వివక్షతను రూపుమాపి, సామాజిక బహిష్కరణ లేకుండా చేసి రూ.లక్ష అందజేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఈ మూడు హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా సిపిఎం రాజకీయం చేస్తుందని మంత్రులు, ప్రభుత్వ అధికారులు విమర్శలు చేయడం సరికాదన్నారు. గరగపర్రు, దేవరపల్లి, చిత్తూరులో తాము చెప్పుతున్న విషయాలు వాస్తవం కాదని టిడిపి ప్రభుత్వం, మంత్రులు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. మహాభారతం ఉత్సవాల్లో డప్పు కొట్టడం, వేషధారణ, అగ్నిగుండం, కుంభం తోలుకొచ్చి బండి కట్టడంలో దళితులకు ప్రవేశం కల్పించడం లేదని ఇది చాలా అన్యాయమన్నారు. చిత్తూరు జిల్లాలో ఇద్దరు అధికార పార్టీ ఎంపీలు, ముగ్గురు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా దళితులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేవరపల్లిలో దళితుల భూములను చెరువులుగా మార్చొద్దని వ్యతిరేకించిన దళిత సంఘాల నాయకులను, రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు చేసి రాత్రికి రాత్రి చెరువులను తవ్వేరని, ఇంతకంటే ఘోరం మరోకటి ఉ ండదన్నారు. మంత్రి పత్తిపాటి పుల్లారావు నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాల్లోని దళితుల భూములను చెరువులుగా మార్చారని వివరించారు. దళితులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయే? వీటిల్లో రాజకీయ పార్టీల పాత్ర ఎంత? దళితుల భూములనే చెరువులుగా ఎందుకు మారుస్తున్నారో? అనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దళితుల పట్ల ఎంత నిర్లక్ష్యం వహిస్తుందో నిరూపించడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. వి కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో దళితుల పట్ల వివక్షత ఇంకా కొనసాగుతుందని చెప్పారు. దళిత పేటలోని ప్రజలను దేవాలయాల్లోకి రానివ్వడం లేదన్నారు. జిల్లాలో వెయ్యి గ్రామాల్లో తాము సర్వే చేస్తే 621 గ్రామాల్లో స్మశానాలు లేవని వివరించారు. ఈ వివరాలను ఆ జిల్లా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. ఋమ్మలకుంట గ్రామం పక్కన మంత్రి సునీత అనుచరులు పవర్ ప్లాంట్ పెట్టి కంచె వేశారని, వారి సహాయంతో దళితుల భూములకు కూడా కంచె వేశారని వివరించారు. సుమారు 1.60లక్షల ఎకరాల భూములను అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితులు చూస్తుంటే దళితులు ఉంటారా? లేదా అనే ఆందోళన నెలకొందన్నారు. నీరు–చెట్టు కార్యక్రమం టిడిపి కార్యకర్తలకు డబుల్ ధమాకా లాంటిదని వివరించారు. ప్రభుత్వం నుంచి డబ్బులు డ్రా చేసుకుని మట్టిని కూడా అమ్ముకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 26శాతం ఉన్న దళితులు అభివృద్ధి చెందకుండా ప్రపంచంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతానని గొప్పలు చేప్పుకోవడం వల్ల ఒరిగేదేమి లేదన్నారు.

= = = =